కూరగాయల ధరలు

శేరిలింగంపల్లి: నల్లగండ్ల మార్కెట్‌లో.. టమాట 20, పచ్చిమిర్చి 45 , బెండ 40, కాకర 60, దొండ 30, దోస 40, ఆలు 30, చామ 60, కీర 40, బీర 60, వంకాయ 30, గోకర 50, బీన్స్ 120, బీట్‌రూట్ 30, క్యాప్సికమ్ 50, క్యాబేజీ 15, క్యారెట్ 40, చిక్కుడు 80, ఉల్లి 25(కేజీ), ములక్కాయలు (2) 10 , క్యాలీఫ్లవర్ (1) 30, సొరకాయ (కేజీ) 20, అల్లం 70, వెల్లుల్లి 150.

5 నుంచి పాలిసెట్-25పై ఉచిత శిక్షణ

రాయదుర్గం: పాలిసెట్–2025పై ఉచితంగా వారం రోజులపాటు ప్రత్యేక శిక్షణ ఇవ్వనున్నట్టు గవర్నమెంట్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ లెదర్ టెక్నాలజీ (జీఐఎల్‌టీ) ప్రిన్సిపల్ షేక్ ఎక్బాల్ హుస్సేన్ శనివారం తెలిపారు. రాయదుర్గంలోని జీఐఎల్‌టీ క్యాంపస్‌లో ఈనెల 5వ తేదీ నుంచి 11వ తేదీ వరకు శిక్షణ ఉంటుందని పాలిసెట్‌కు దరఖాస్తు చేసిన విద్యార్థులకు ప్రవేశ పరీక్షపై అవగాహన కల్పించడం, మార్కుల సాధన కోసం ఈ ప్రత్యేక క్రాష్ కోచింగ్ ఇవ్వడానికి నిర్ణయించినట్లు ఆయన వివరించారు. పాలిసెట్‌లో అర్హత సాధించిన వారికే రాయదుర్గం జీఐఎల్‌టీలో సీటు పొందే అవకాశం ఉంటుందని ఆయన వివరించారు.

ఉచిత వైద్యశిబిరం



శిబిరంలో కంటి పరీక్షలు చేస్తున్న వైద్యులు

చందానగర్: లయన్స్ క్లబ్ ఆఫ్ హోప్, ఆనంద కంటి ఆసుపత్రి ఆధ్వర్యంలో చందానగర్ హుడా కాలనీ హోప్ కార్యాలయం వద్ద శనివారం కంటి పరీక్షలు నిర్వహించారు. ఈ సందర్భంగా లయన్స్ క్లబ్ జోన్ చైర్మన్ కొండ విజయ్ కుమార్ మాట్లాడుతూ పరీక్షల అనంతరం అవసరమైన వారికి కంటి అద్దాలు అందజేయడం జరిగిందన్నారు. సుమారు 200 మందికి పరీక్షలు చేశారు. కార్యక్రమంలో వైద్య బృందంతో పాటు లయన్స్ క్లబ్ సభ్యులు లక్ష్మీ నారాయణగౌడ్, అశోక్‌గౌడ్, మధుసూదన్‌రెడ్డి, ప్రవీణ్ రెడ్డి, సింగ్ దాసరి రాజశేఖర్, మారం ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

ప్రత్యేక పూజలు



రాయదుర్గం: గౌలిదొడ్డిలోని సంజీవిని ఆంజనేయ సహిత వైకుంఠ శ్రీసీతారామ నారాయణ స్వామి ఆలయంలో శనివారం ప్రత్యేక పూజలు చేశారు. వైశాఖమాసం పునర్వసు మాస తిరు నక్షత్రాన్ని పురస్కరించుకొని నారాయణుడికి అభిషేకం, అలంకారం చేసి భక్తులకు దర్శనం కల్పించారు. ఉదయం హోమం, మన్యసూక్త హోమం, శ్రీరామ మూలమంత్ర హవనం, పూర్ణాహుతి నిర్వహించారు. భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

హైదర్‌నగర్‌ను ఆదర్శ డివిజన్‌గా తీర్చిదిద్దుతా

ఆల్విన్‌కాలనీ: హైదర్‌నగర్ డివిజన్ పరిధిలోని సమస్యలు పరిష్కరించి అభివృద్ధిలో ఆదర్శ డివిజన్‌గా తీర్చిదిద్దుతానని కార్పొరేటర్ నార్నె శ్రీనివాసరావు అన్నారు. లేక్‌వ్యూ కాలనీలో అధికారులతో కలిసి శనివారం పర్యటించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. లేక్ వ్యూ కాలనీలో సమస్యలను అధికారులు త్వరగా పరిష్కరించాలన్నారు. వీధి దీపాల సమస్యను వెంటనే పరిష్కరించాలన్నారు. మౌలిక వసతుల కల్పనకు ప్రథమ ప్రాధాన్యత ఇస్తూ కాలనీలను అన్ని రంగాల్లో అభివృద్ధి చేస్తానన్నారు. కార్యక్రమంలో జీహెచ్‌ఎంసీ ఇంజినీరింగ్ వర్క్స్ ఇన్‌స్పెక్టర్ మహదేవ్, సంజీవరావు, ఎలక్ట్రికల్ సుధాకర్, వాటర్ వర్క్స్ సూపర్‌వైజర్ నరేంద్రచారి, సిబ్బంది వాటర్ లైన్‌మెన్ శ్రీకాంత్, కాలనీవాసులు పాల్గొన్నారు.

సంక్షేమ పథకాలను సద్వినియోగం చేసుకోవాలి

ఆల్విన్‌కాలనీ: సంక్షేమ పథకాలను అర్హులు సద్వినియోగం చేసుకోవాలని పీఏసీ చైర్మన్, ఎమ్మెల్యే గాంధీ అన్నారు. కూకట్‌పల్లి మండల పరిధిలోని వివేకానందనగర్, హైదర్‌నగర్, ఆల్విన్‌కాలనీ, కూకట్‌పల్లి పార్టు డివిజన్‌లకు చెందిన 71 మందికి శనివారం కార్పొరేటర్ నార్నె శ్రీనివాసరావుతో కలిసి కల్యాణలక్ష్మి, షాదీ ముబారక్ చెక్కులను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పేదల సంక్షేమమే ధ్యేయంగా రాష్ట్ర ప్రభుత్వం పని చేస్తుందన్నారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి పేదల పక్షపాతి అని, పేదింటి ఆడబిడ్డకు పెద్దన్నలాగా నిలుస్తున్నారన్నారు. నిరుపేద ఆడబిడ్డల పెళ్లికి దేశంలో ఎక్కడా లేని విధంగా కల్యాణలక్ష్మి, షాదీ ముబారక్ పథకాలను ఇక్కడ అమలు చేస్తున్నారన్నారు. కార్యక్రమంలో మాజీ కౌన్సిలర్ రఘుపతి రెడ్డి, నాయకులు సంజీవరెడ్డి, ప్రసాద్, దొడ్ల రామకృష్ణ గౌడ్, శ్రీధర్ రెడ్డి, బాలనర్సయ్య, అక్కిరెడ్డి, నిఖిల్ పాల్గొన్నారు.

ప్యాచ్‌వర్క్‌లు, సీసీ పనులు మిగిలాయ్..

లింగంపల్లి రైల్వే అండర్‌బ్రిడ్జి వద్ద పూర్తి కావొచ్చిన బాక్స్‌టైప్ డ్రెయిన్ పనులు ● 15 రోజుల్లో పనులు పూర్తి చేసేలా చర్యలు





లింగంపల్లి రైల్వే అండర్‌బ్రిడ్జి వద్ద తుదిదశకు చేరిన పనులు

శేరిలింగంపల్లి: లింగంపల్లి రైల్వే అండర్ బ్రిడ్జి వద్ద రెండేళ్ల క్రితం రూ.4 కోట్ల వ్యయంతో చేపట్టిన బాక్స్ టైప్ డ్రైన్, కల్వర్టు పనులు దాదాపుగా పూర్తి కాగా.. ఆయా పనుల్లో భాగంగా సీసీ రోడ్డు, ప్యాచ్‌వర్క్ పనులను 15 రోజుల్లో పూర్తి చేయాలని అధికారులు నిర్ణయించారు. రెండేళ్లుగా సాగుతున్న పనులు ఈ వర్షాకాలం నాటికైనా పూర్తి చేస్తారా అని ప్రజలు అంటున్నారు. కాగా లింగంపల్లి రైల్వే అండర్ బ్రిడ్జి వద్ద దశాబ్దాలుగా వర్షం పడితే చాలు వాహనాల రాకపోకలు నిలిచిపోవడం, భారీ వర్షాలు కురిస్తే మోకాలిలోతు నీరు చేరడం జరుగుతోంది. దీంతో నల్లగండ్ల కూరగాయల మార్కెట్ మీదుగా రాకపోకలు జరిగేవి. ఈ నేపథ్యంలో ప్రజలు చుట్టు తిరిగిరావాల్సి వస్తోందని సమయం వృథా అవడంతో బాటు ఇబ్బందిపడుతున్నామని వాపోయేవారు. ఈ పనులు పూర్తయితే వరదకష్టాలు తీరినట్టే.

నెలాఖరుకు పూర్తి చేస్తాం

లింగంపల్లి రైల్వే అండర్‌బ్రిడ్జి కింద పనులను ఈ నెలాఖరులోగా పూర్తి చేయాలని సంకల్పించాం. అందుకు తగినట్లుగా పనులలో వేగం పెంచాం. పనుల్లో నాణ్యతకు అత్యంత ప్రాధాన్యత ఇచ్చాం. ప్యాచ్‌వర్క్, సీసీ పనులు మాత్రమే మిగిలి ఉన్నాయి.– ఆనంద్, డీఈఈ, జీహెచ్‌ఎంసీ శేరిలింగంపల్లి సర్కిల్

పదిలో ప్రతిభ చూపిన విద్యార్థినులకు సన్మానం



రాయదుర్గం: పదో తరగతి పరీక్షలలో అత్యుత్తమ మార్కులు సాధించిన రాయదుర్గం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులను శనివారం ఘనంగా సత్కరించారు. పాఠశాల ఆవరణలో రాయదుర్గం విద్యా కమిటీ, జెడ్పీహెచ్‌ఎస్ ఉపాధ్యాయ బృందం సంయుక్తంగా ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు. పాఠశాల టాపర్లుగా నిలిచిన ఏఎస్ సాలియాతాజీన్ (576/600) జిల్లాస్థాయిలో రెండవ స్థానం, డి నందిని(509/600), మల్లిక (504/600)లతోపాటు మరికొంత మంది విద్యార్థినులను ఘనంగా సత్కరించారు.

త్వరలో బంధంకొమ్ము రిజర్వాయర్ ప్రారంభం

- ఎమ్మెల్యే మహిపాల్ రెడ్డి
- 10 కోట్లతో రెండు మిలియన్ లీటర్ల సామర్థ్యం

పటాన్‌చెరు: అమీన్‌పూర్ మున్సిపల్ పరిధిలోని బంధం కొమ్ము.. కృష్ణ బృందావన్ కాలనీలో 20 లక్షల లీటర్ల సామర్థ్యంతో నిర్మించిన నూతన రిజర్వాయర్‌ను అతి త్వరలో ప్రారంభించేందుకు సన్నాహాలు చేస్తున్నామని ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి తెలిపారు. శనివారం స్థానిక మాజీ ప్రజాప్రతినిధులు ,జలమండలి అధికారులతో కలిసి ఆయన రిజర్వాయర్‌ను పరిశీలించారు.ఈ సందర్భంగా మాట్లాడుతూ... పెరుగుతున్న జనాభాకు అనుగుణంగా నూతన కాలనీలకు సైతం మంచి నీరు అందించేందుకు ప్రణాళికలు సిద్ధం చేస్తున్నామని తెలిపారు. ఈ నేపథ్యంలోనే బంధంకొమ్ము రిజర్వాయర్‌ను ప్రారంభించనున్నట్లు తెలిపారు. మున్సిపల్ పరిధిలో ఐదు రిజర్వాయర్ల నిర్మాణాలు చేపట్టగా మూడింటిని ప్రారంభించుకోవడం జరిగిందని తెలిపారు. కార్యక్రమంలో మున్సిపల్ మాజీ చైర్మన్ తుమ్మల పాండురంగారెడ్డి, మాజీ ఎంపీపీ దేవానందం, మాజీ జెడ్పీటీసీ సుధాకర్ రెడ్డి, జలమండలి జీఎం సుబ్బారాయుడు, మున్సిపల్ కమిషనర్ జ్యోతిరెడ్డి, డీజీఎం చంద్రశేఖర్, మేనేజర్ పూర్ణేశ్వరి, సీనియర్ నాయకులు గోపాల్, ఉపేందర్‌రెడ్డి, రాజు, కొల్లూరి మల్లేష్, యూసుఫ్, మహిపాల్ తదితరులు పాల్గొన్నారు.

తెల్లాపూర్ మున్సిపాలిటీ పరిధిలో..

రామచంద్రాపురం(పటాన్‌చెరు): తెల్లాపూర్ మున్సిపాలిటీ పరిధిలో తాగునీటి సమస్యకు శాశ్వత పరిష్కారం చూపుతామని ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి అన్నారు. శనివారం తెల్లాపూర్ మున్సిపాలిటీ పరిధిలోని ఉస్మాన్‌నగర్‌లో నూతనంగా నిర్మించిన మిషన్ భగీరథ మంచినీటి రిజర్వాయర్‌ను ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ రిజర్వాయర్ ద్వారా 55 కాలనీలలోని 22,497 ఇళ్లకు సురక్షితమైన నీటిని అందిస్తామన్నారు. త్వరలో దీనిని ప్రారంభోత్సవం చేయనున్నట్లు తెలిపారు.



రిజర్వాయర్ వివరాలను అధికారులను అడిగి తెలుసుకుంటున్న ఎమ్మెల్యే

వేసవి వెన్నెల.. ఉచిత శిక్షణ

మాదాపూర్: అన్నమయ్యపురంలో 617వ అన్నమయ్య జయంతి సందర్భంగా ఈ నెల 6వ తేదీ నుంచి 10వ తేదీ వరకు శిక్షణ తరగతులు నిర్వహిస్తున్నారు. రోజు సాయంత్రం 6గంటల నుంచి 7.30 గంటల వరకు ఉంటాయన్నారు. వివరాలకు ఫోన్‌: 9848024042, 9866240561, 9966002879లలో సంప్రదించగలరు.

అభివృద్ధి పనులకు శంకుస్థాపన



శంకుస్థాపన చేసిన ఎమ్మెల్యే గాంధీ

మియాపూర్: ప్రభుత్వం అభివృద్ధి, ప్రజా సంక్షేమానికి పెద్దపీట వేస్తూ ముందుకు సాగుతుందని ఎమ్మెల్యే గాంధీ అన్నారు. డివిజన్ పరిధిలోని డాక్టర్ రెడ్డీస్ కాలనీ, కృష్ణసాయి ఎన్‌క్లేవ్, జనప్రియ వెస్ట్‌సిటీ, ప్రశాంత్‌నగర్, న్యూ ప్రశాంత్‌నగర్ కాలనీలో రూ.2కోట్ల 28లక్షల 50వేలతో నూతనంగా చేపడుతున్న సీసీ, బీటీ రోడ్లు, పార్క్ అభివృద్ధి పనులకు కార్పొరేటర్ ఉప్పలపాటి శ్రీకాంత్‌తో కలిసి శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ...శేరిలింగంపల్లి నియోజకవర్గ అభివృద్ధే ధ్యేయంగా ముందుకు సాగుతున్నామన్నారు.

ఆరోగ్యం పట్ల శ్రద్ధ చూపాలి

రామచంద్రాపురం(పటాన్‌చెరు): ప్రతి ఒక్కరూ ఆరోగ్యం పట్ల ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని భారతీనగర్ డివిజన్ కార్పొరేటర్ వి.సింధూరెడ్డి అన్నారు. శనివారం డివిజన్ పరిధిలోని ఎల్‌ఐజీ కాలనీలోని శ్రీ కార్యసిద్ధి పంచముఖి ఆంజనేయస్వామి ఆలయంలో నిర్వహించిన ఉచిత వైద్య శిబిరాన్ని ఆమె ప్రారంభించారు. అనంతరం ఆలయ ప్రాంగణంలో బీఆర్‌ఎస్ నియోజకవర్గ కోఆర్డినేటర్ ఆదర్శ్‌రెడ్డి ఆధ్వర్యంలో శాసనమండలి మాజీ చైర్మన్ భూపాల్ రెడ్డి పుట్టినరోజు సందర్భంగా నిర్వహించిన అన్నదాన కార్యక్రమంలో ఆమె పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రతిఒక్కరూ ఆరోగ్యం కోసం నిత్యం గంట సమయాన్ని కేటాయించాలని కోరారు. వి.చంద్రశేఖర్ రెడ్డి, మాజీ కార్పొరేటర్ అంజయ్య, నాయకులు నర్సింహ పాల్గొన్నారు.

గంజాయి విక్రేత అరెస్ట్

3 కేజీల గంజాయి స్వాధీనం



మియాపూర్ పోలీసులు స్వాధీనం చేసుకున్న గంజాయి

మియాపూర్: గంజాయి క్రయవిక్రయాలు చేస్తున్న ఓ వ్యక్తిని మియాపూర్ పోలీసులు అరెస్ట్ చేసి అతని వద్దనుండి 3కేజీల గంజాయిని స్వాధీనం చేసుకుని రిమాండ్‌కు తరలించారు. ఎస్ఐ నర్సింహారెడ్డి తెలిపిన వివరాల ప్రకారం... ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం కృష్ణా జిల్లా పులేటికట్ట గ్రామానికి చెందిన బండ ప్రతాప్(19) మియాపూర్‌లోని రాజారాం కాలనీలోని తేజస్వీని బాయ్స్ హాస్టల్‌లో ఉంటున్నాడు. సులభంగా డబ్బు సంపాదించాలనే ఆశతో కొంతకాలంగా గంజాయి తెచ్చి నగరంలో విక్రయిస్తున్నాడు. ప్రతాప్ శనివారం ఉదయం రాజారాంనగర్ కాలనీ సమీపంలో గంజాయిని విక్రయించేందుకు వెళ్తుండగా పోలీసులు అనుమానంతో అదుపులోకి తీసుకుని తనిఖీ చేయగా అతని వద్ద 3 కేజీల ఎండుగంజాయిని గుర్తించారు. దీంతో అరెస్ట్ చేశారు. ఆంధ్రప్రదేశ్ ఉయ్యూరు గ్రామానికి చెందిన జయదేవ్ అనే వ్యక్తి నుండి గంజాయిని తీసుకువచ్చి నగరంలో అమ్ముతున్నట్టు పోలీసుల విచారణలో ప్రతాప్ వెల్లడించారు. దీంతో మియాపూర్ పోలీసులు అతని వద్దనున్న 3 కేజీల గంజాయిని స్వాధీనం చేసుకుని రిమాండ్‌కు తరలించినట్లు తెలిపారు. గంజాయి సప్‌లై చేస్తున్న జయదేవ్ పరారీలో ఉన్నట్లు తెలిపారు.

టికెట్ తీసుకోమన్నందుకు బస్ కండక్టర్‌పై దాడి

గచ్చిబౌలి: టికెట్ తీసుకోవాలని అన్నందుకు బస్ కండక్టర్‌పై దాడికి పాల్పడిన సంఘటన రాయదుర్గం పోలీస్ స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. బర్కత్‌పుర డిపోకు చెందిన రూట్ నెంబర్ 216 ఆర్టీసీ సిటీ బస్సు లింగంపల్లి నుంచి మెహిదీపట్నం వైపు వస్తుండగా శుక్రవారం రాత్రి 8 గంటల సమయంలో గచ్చిబౌలి జంక్షన్‌లో ముందు నుంచి నలుగురు వ్యక్తులు, వెనక నుంచి ఒక మహిళ బస్సు ఎక్కారు. టికెట్ తీసుకోవాలని కండక్టర్ మాణిక్యం అడుగగా వెనక ఉన్నవారు తీసుకుంటారని చెప్పారు. వెనక ఉన్న మహిళను అడగగా ముందు ఉన్న వారు తీసుకుంటారని చెప్పింది. ఎవరు తీసుకోకపోవడంతో టికెట్ తప్పని సరి అని కండక్టర్ చెప్పడంతో యువకులు దాడికి పాల్పడ్డారు. విచక్షణా రహితంగా కొడుతుండటంతో ప్రయాణికులు స్పందించి దాడికి పాల్పడిన వారిని పట్టుకొని రాయదుర్గం పోలీస్‌స్టేషన్‌లో అప్పగించారు. కండక్టర్ మాణిక్యం ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.



లేక్ వ్యూ కాలనీలో ఇళ్లముందు ప్రవహిస్తున్న డ్రైనేజీ నీరు

మోడీ చిత్రపటానికి పాలాభిషేకం



మోడీ చిత్రపటానికి పాలాభిషేకం చేస్తున్న నాయకులు రవికుమార్ యాదవ్

చందానగర్: దేశంలో జనగణన, కులగణన చేయాలని తలపెట్టిన చరిత్రాత్మక నిర్ణయాన్ని స్వాగతిస్తున్నామని బీజేపీ శేరిలింగంపల్లి నియోజకవర్గం ఇంచార్జి, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు రవికుమార్ యాదవ్ పేర్కొన్నారు. శనివారం హఫీజ్‌పేట్ డివిజన్ పరిధిలోని మైత్రీనగర్ కమాన్ వద్ద ప్రధాని మోడీ చిత్రపటానికి పార్టీ కార్యకర్తలు, నాయకులతో కలిసి ఆయన పాలాభిషేకం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వెనుకబడిన వర్గాలకు సామాజిక న్యాయం, రిజర్వేషన్ల విధానం, వనరుల పంపిణీ, విద్యా, ఉద్యోగం, ఇలా ఎన్నో ప్రయోజనాలు ఉన్నాయన్నారు. మనమందరం ఇందులో భాగస్వాములవ్వాలని కోరారు. కార్యక్రమంలో డివిజన్ అధ్యక్షులు ఆకుల లక్ష్మణ్, జితేందర్, నాగులు గౌడ్, బుచ్చిరెడ్డి, రమణయ్య, రామరాజు, అజిత్ కుమార్, మనోహర్, గణేష్, శివారెడ్డి, శ్రీనివాస్‌రెడ్డి, పట్టాభిరామ్ పాల్గొన్నారు.

సృజన జాతీయ నృత్యోత్సవాలు

శిల్పారామంలో రెండ్రోజుల పాటు నిర్వహణ



మాదాపూర్: శిల్పారామంలో నిర్వహించే వారాంతపు కార్యక్రమాలలో భాగంగా శనివారం సృజన జాతీయ నృత్యోత్సవాలను ప్రారంభించారు. ఈ ఉత్సవాలు రెండ్రోజుల పాటు జరగనున్నాయి. భరతనాట్యం, పీకాక్ డ్యాన్స్, డాక్టర్ రేవతి ప్రసాద్ బృందం నాగినీ డాన్స్, సంజనచే లావని, డాక్టర్ శ్రీకాంత్ గౌడ్ రాజస్థానీ, డాక్టర్ రవికుమార్ బంజారా, వెంకట్ బృందం పేరిణీ నృత్య ప్రదర్శనలు సందర్శకులను విశేషంగా ఆకట్టుకున్నాయి. కార్యక్రమంలో ఏస్ అర్బన్ ఇన్ఫోసిటీ లిమిటెడ్ డైరెక్టర్ శంకర్, శ్రీకర హాస్పిటల్ సీఎండీ డాక్టర్ అఖిల్ తదితరులు పాల్గొని కళాకారులను అభినందించారు.

అన్నమయ్యపురంలో..

మాదాపూర్‌లోని అన్నమయ్యపురంలో నిర్వహించే అన్నమయ్య స్వరార్చనలో భాగంగా శనివారం కూచిపూడి నృత్యార్చన నిర్వహించారు. అన్నమాచార్య భావనావాహిని శిష్యులు అన్నమయ్య గాయత్రి, గురుస్తుతి చేశారు. అనంతరం నాట్యప్రేరణ స్కూల్ ఎర్రోజు శరత్‌కుమార్ శిష్యబృందం గణనాధాయ, దశావతారం తారంగం, ఉదయాద్రి సంకీర్తనలకు కూచిపూడి నృత్య ప్రదర్శనతో సందర్శకులను అలరించారు. అనంతరం కళాకారులను అన్నమాచార్య భావనావాహిని వ్యవస్థాపకురాలు డాక్టర్ శోభారాజు ఘనంగా సత్కరించారు.



భారతీయ కళలు మహోన్నతమైనవి

ఎమ్మెల్యే గాంధీ

రాయదుర్గం: భారతీయ సాంప్రదాయ కళలు మహోన్నతమైనవని ఎమ్మెల్యే ఆరెకపూడిగాంధీ పేర్కొన్నారు. కొండాపూర్‌లోని శ్రీరాంనగర్‌కాలనీలో ఏర్పాటు చేసిన ఎస్‌వీజీ కళావర్షిణి ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ డ్యాన్స్, మ్యూజిక్, ఆర్ట్స్ అండ్ యోగా కేంద్రంతో పాటు మామ్స్ టచ్ పేరిట ఏర్పాటు చేసిన పసి పిల్లల సంరక్షణ కేంద్రాన్ని ఆయన శనివారం ప్రారంభించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ పిల్లలకు చిన్నప్పటి నుంచే సాంప్రదాయ, శాస్త్రీయ నృత్యకళల్లో శిక్షణ ఇప్పించాలని సూచించారు. బాల్యం నుంచే తల్లిదండ్రులు ప్రోత్సహించాలన్నారు. కార్యక్రమంలో ప్రముఖ వైద్యురాలు డాక్టర్ శ్రీదేవి రాగి, ఎస్‌వీజీ కళావర్షిణి సంస్థ వ్యవస్థాపకురాలు సంధ్యారాణి, స్థానిక నాయకులు చాంద్‌పాషా, బలరామ్ యాదవ్ పాల్గొన్నారు.

ఘనంగా శ్రీవారి బ్రహ్మోత్సవాలు

రామచంద్రాపురం(పటాన్‌చెరు): బీహెచ్‌ఈఎల్ టౌన్‌షిప్‌లోని వేంకటేశ్వరస్వామి బ్రహ్మోత్సవాల్లో భాగంగా శనివారం మూలమంత్ర హోమం, మహా సుదర్శన హోమం, లక్ష తులసి పూజ, గరుడోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయ ప్రధాన అర్చకులు కృష్ణమాచార్యులు మాట్లాడుతూ ఈనెల 8వతేదీ వరకు బ్రహ్మోత్సవాలు జరుగుతాయని తెలిపారు. భక్తులు పెద్ద ఎత్తున పాల్గొని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు.

ఐఎన్‌టీయూసీతోనే సమస్యల పరిష్కారం



కార్యక్రమంలో మాట్లాడుతున్న రెహమాన్

రామచంద్రాపురం (పటాన్‌చెరు): కార్మికుల సమస్యల పరిష్కారం ఐఎన్‌టీయూసీతోనే సాధ్యమని భెల్ ఐఎన్‌టీయూసీ అనుబంధ సంస్థ బీఎస్‌టీయూసీ అధ్యక్షులు రెహమాన్ తెలిపారు. శనివారం భెల్ టౌన్‌షిప్‌లోని యూనియన్ కార్యాలయంలో ఐఎన్‌టీయూసీ వ్యవస్థాపక దినోత్సవంను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దేశంలో నేడు ప్రభుత్వ రంగ సంస్థల పరిస్థితి ప్రమాదకరంగా మారిందన్నారు. కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న కొత్త చట్టాల వలన కార్మికులకు తీవ్ర అన్యాయం జరుగుతుందన్నారు. భెల్ యాజమాన్యం కార్మిక సమస్యల పరిష్కారంలో విఫలమైందని వాపోయారు. కార్యక్రమంలో యూనియన్ ప్రధాన కార్యదర్శి స్వామి, నాయకులు కొండారెడ్డి, మహిపాల్ రెడ్డి, శ్రీరాములు నాయక్ పాల్గొన్నారు.

లేక్ వ్యూ.. మురుగుమయం

- కాలనీలో ఇళ్లముందు పారుతున్న డ్రైనేజీ
- సమస్య పరిష్కరించాలని అధికారులకు పలుమార్లు వినతి
- పట్టించుకోలేదని మండిపడుతున్న స్థానికులు



ఆల్విన్‌కాలనీ: హైదర్‌నగర్ డివిజన్ పరిధిలోని లేక్ వ్యూ కాలనీ రోడ్డు నంబర్ 1లో మురుగు సమస్యతో స్థానికులు సతమతమవుతున్నారు. అండర్ గ్రౌండ్ డ్రైనేజీ ఏర్పాటు చేయకపోవడంతో ఇళ్ల నుంచి మురుగునీరు రోడ్డుపై ప్రవహిస్తుండటంతో ఇబ్బందులు ఎదురవుతున్నాయి. ఇళ్ల ముందు మురుగు ప్రవహిస్తుండటంతో ఆరు బయటకు రావాలంటే అసౌకర్యంగా ఉందని స్థానికులు వాపోతున్నారు. బయటకు వస్తే దుర్వాసన భరించలేకపోతున్నామని ఇక ఈగలు, దోమలతో అనారోగ్యం బారిన పడుతున్నారని చెప్పారు. ఇటీవల అడపాదడపా కురుస్తున్న వర్షాలకు మురుగునీరు తోడవడంతో ఇళ్లల్లో ఉండలేని పరిస్థితి నెలకొందని స్థానికులు మొర పెట్టుకుంటున్నారు. రోడ్డు కూడా శిథిలావస్థకు చేరటంతో గుంతలలో మురుగు నీరు చేరటంతో వాహనాల రాకపోకల సమయంలో చింది పడుతుండడంతో గొడవలకు దిగుతున్నారని పేర్కొన్నారు. స్థానిక ప్రజా ప్రతినిధులకు, అధికారులకు పలుమార్లు వినతిపత్రాలిచ్చినా పరిష్కరించడం లేదన్నారు. ఇంటి పన్నులు వసూలు చేయటంలో ఉన్న శ్రద్ధ వసతుల కల్పనలో ప్రభుత్వ లేదని మండిపడుతున్నారు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు, ప్రజాప్రతినిధులు లేక్ వ్యూ కాలనీలో పర్యటించి అండర్‌గ్రౌండ్ డ్రైనేజీ, రహదారుల సమస్యను పరిష్కరించాలని విజ్ఞప్తి చేస్తున్నారు.

మురుగునీటితో సహవాసం



లేక్ వ్యూ కాలనీ రోడ్డు నంబర్1లో సెంట్రల్ డ్రైనేజీ సిస్టం లేకపోవడంతో ఇళ్ల ముందే మురుగునీరు ప్రవహిస్తున్నది. కొన్ని నెలలుగా మురుగునీటితో సహవాసం చేయాల్సిన పరిస్థితి నెలకొంది. దుర్వాసనతో సతమతమవుతున్నాం. అధికారులు, ప్రజాప్రతినిధులు స్పందించాలి.

– సురేందర్‌రెడ్డి, లేక్‌వ్యూ కాలనీవాసి